క్లుప్తంగా

మహిళా సాధికారతలో ఆదర్శంగా జగన్ ప్రభుత్వం

రాయచోటి : మహిళలకు ఏమాత్రం గౌరవం తగ్గకుండా రాజకీయ, ఆర్థిక, సామాజికం ఇలా అన్ని రంగాలలో వారికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు అనిర్వచనీయమైనవని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానంలు నియోజకవర్గ మహిళలకు మంగళవారం వారు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి మహిళా సంక్షేమానికి జగన్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలియజేశారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నందలూరు(రాజంపేట): అన్నమయ్య జిల్లా నందలూరు మండలం ఆడపూరులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, జూనియర్ ఇంటర్ ప్రవేశానికి విద్యార్థినులు(బాలికలు) దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ మాధవిలత తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ జూనియర్ ఇంటర్మీడియట్ విద్యార్థినులకు ఎంపీసీ, బైపీసీ ఇంగ్లిష్ మీడియం ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 24 చివరి తేదీ అన్నారు. ఏప్రిల్ 23వ తేదీన ప్రవేశ పరీక్ష ఉదయం 5వ తరగతికి, మధ్యాహ్నం జూనియర్ ఇంటర్‌కు జరుగుతుందన్నారు. అప్లికేషన్, ఇతర వివరాలకు 9491410474, 7799251393 ఫోన్ చేసి సంప్రదించాలని ఆమె అన్నారు.

ఆకేపాడులో రీ సర్వే పనులు



రీసర్వేను ప్రారంభిస్తున్న రెవెన్యూ సిబ్బంది

రాజంపేట : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వే మంగళవారం మండలంలోని ఆకేపాడులో నిర్వహించారు. ఇప్పటికే సీతారాంపురంలో రీ సర్వే చేసి జగనన్న భూ హక్కు పత్రాలను రైతులకు అందజేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఆకేపాడులో చేపట్టిన రీసర్వేను సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పరిశీలించారు. గ్రామంలోని భూములను డ్రోన్‌తో రీసర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ రీసర్వే తీరు తెన్నులపై ఆరాతీశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శ్రీకాంత్‌రెడ్డి, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు హరిత, సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, మండల సర్వేయర్ వెంకటసుబ్బయ్య, వీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

పుల్లంపేట : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో మండల పరిధిలోని టి.కమ్మపల్లెలోని నూతన రామాలయంలో పుల్లంపేట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు, సిబ్బంది మజ్జిగ చలివేంద్రాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. దీంతో గ్రామ ప్రజలు బ్యాంక్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులను రామాలయ సిబ్బంది సన్మానించారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

ఓబులవారిపల్లె : విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని ప్రధానోపాధ్యాయులు రమణయ్య పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమంలో నృత్యాలు ప్రదర్శించారు. ఉపాధ్యాయులు రామలింగరాజు, సుబ్బారెడ్డి, సి.శ్రీనివాసులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

రామాపురం : రాచపల్లె గ్రామ పంచాయతీ సచివాలయాన్ని మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు డైరెక్టర్ ధనలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకొని తగు సూచనలిచ్చారు. రాచపల్లె వడ్డెపల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ వెంకటరెడ్డి అధ్యక్షతన ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు హాజరై గర్భిణులకు శ్రీమంతపు వేడుకలను నిర్వహించారు. వీరితో పాటు విస్తరణ అధికారి ఉషారాణి, సీడీపీఓ పద్మావతి, పంచాయతీ కార్యదర్శి రెడ్డిబిందు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, పద్మజ, మహిళా కార్యదర్శి మౌనిక పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చండి

రాయచోటి అర్బన్ : అన్నమయ్య జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చాలని పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రవిశంకర్ కోరారు. మంగళవారం ఆయన చైతన్య మహిళా సమాఖ్య నాయకురాలు ఝాన్సీలక్ష్మి, జిల్లా వినియోగదారుల సంఘం సభ్యులు దర్బార్‌లతో కలసి మున్సిపల్ మేనేజర్ రాధను కలిసి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. పట్టణవాసులకు ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘం సభ్యులు శేఖర్, మేకల దర్బార్‌బాషా, అంజనేయులు, న్యామతుల్లా, రమణ తదితరులు పాల్గొన్నారు.

అకాశమే హద్దుగా..

- ప్రోత్సహిస్తే రాణించగల సత్తా మహిళలది
- మారాల్సింది సామాజిక దృక్పథమే
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



రాజంపేట టౌన్ : అందం, అభినయం, అణకువ ఇవి ఒకప్పటి మహిళకు నిర్వచనం. పరిణితి, పరిపక్వత, పరాక్రమం, ఆకాశమే హద్దుగా రాణించగల స్థైర్యం నేటి మహిళల సొంతం. అవనిలో, ఆకాశంలో, అభివృద్ధిలో సగం ఆమె..ఒక్కమాటలో చెప్పాలంటే మహిళ సహకారం, తోడ్పాటు లేకుండా పురుషుడు కుటుంబం అనే నావను నడపలేడు. నేటి మహిళలు కుటుంబంలోనే కాక అన్ని రంగాల్లో రాణిస్తూ ఆ కుటుంబం ఆర్థికాభివృద్ధిలోను ముఖ్య భూమిక పోషిస్తున్నారంటే అతిశయోక్తికాదనే చెప్పాలి. సమాజంలో పురుషులతో సమానంగా ఇంకా చెప్పాలంటే అంతకంటే ఎక్కువగా రాణిస్తున్నప్పటికి కొన్ని సందర్భాల్లో 'మృగాళ్ళ'ను ధీటుగా ఎదుర్కోలేక మహిళలు అణచివేతకు గురవుతూనేవున్నారు. మహిళలు మరింత ఎదగాలంటే సామాజిక దృక్పథం మారాలి. స్త్రీ తనను తాను సంస్కరించుకోవాల్సిన అవసరం ఎంతైనావుంది. ఇదిలావుంటే ఆధునిక యుగంలో మహిళలు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు అవకాశాలను అందిపుచ్చుకొని ప్రగతివైపు పయనిస్తుండటం సంతోషించదగ్గ విషయం. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అవకాశాలను అందిపుచ్చుకొని రాణించిన మహిళల మనోగతం వారి మాటల్లోనే..

విద్యతోనే ఏదైనా సాధించగలం



సమాజంలో రాణించాలంటే ఆడపిల్లలకు విద్య చాలా అవసరం. ఆడపిల్లలు ఉన్నత విద్య అభ్యసిస్తే ఎంచుకున్న రంగంలో రాణించగలరు అలాగే ఏదైనా సాధించగలరు. అందువల్ల ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన తల్లిదండ్రులు ఆడపిల్లలను ప్రోత్సహించాలి. నేను ఉన్నత విద్య అభ్యసించడం వల్ల లెక్చరర్ అయ్యాను. ఆ తరువాత రాజకీయాల్లో అవకాశం రావడంతో రాజకీయరంగ ప్రవేశం చేసి మంత్రిగా పనిచేశాను. ఇదంతా నేను బాగా చదువుకోవడం వల్లే సాధ్యమైంది. మహిళలు ఏదైనా సాధించగలం అన్న ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలి. అప్పుడే సమాజంలో పురుషులతో సమానంగా రాణించగలరు.

– సామినేని సరస్వతి, రాష్ట్ర మాజీ మంత్రి, రాజంపేట

తల్లి ప్రోత్సాహంతో అంతర్జాతీయ స్థాయికి



వాలీబాల్ మాజీ క్రీడాకారిణి వసుమతిది చిన్నప్పుడు కటిక పేదరికం. పుట్టిన ఏడాదికే తండ్రి చనిపోయాడు. ఇలాంటి పరిస్థితుల్లో తల్లి లక్ష్మీకుమారి పొలం పనులకు వెళ్ళి కుటుంబాన్ని పోషించింది. హైస్కూల్ స్థాయి వాలీబాల్ క్రీడలో వసుమతి తర్ఫీదు పొందింది. తనలో ప్రతిభ ఉందన్న విషయాన్ని అప్పటి పీడీ షమీర్‌బాషా గుర్తించి ప్రోత్సహించారు. ఎందరో చులకనగా చూసిన ఆమె తల్లిమాత్రం వారి మాటలను పట్టించుకోకుండా వసుమతిని ప్రోత్సహించింది. ఆమె 2002లో అంతర్జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో ఆడింది. ఫలితంగా రైల్వేశాఖలో ఉద్యోగం సాధించి ప్రస్తుతం హైదరాబాద్‌లోని లాలాగూడ ఆఫీస్ సూపరిండెంట్‌గా పనిచేస్తుంది. తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే ఆడపిల్లలు ఉజ్వల భవిష్యత్తును ఏర్పరుచుకోగలరని ఆమె ధీమాగా చెబుతోంది.

– వసుమతి, వాలీబాల్ మాజీ క్రీడాకారిణి, కూచివారిపల్లె, రాజంపేట

స్వశక్తిపై విశ్వాసంతోనే రాణించగలరు

మహిళలకు సూచించిన బద్వేలు ఎమ్మెల్యే డా.డి.సుధా



మాట్లాడుతున్న బద్వేలు ఎమ్మెల్యే డా.సుధా

రాజంపేట : మహిళలు స్వశక్తిపై విశ్వాసం కలిగివున్నప్పుడే అన్ని రంగాలలో రాణించగలరని, ఎటువంటి సమస్యను అయినా ధైర్యంగా ఎదుర్కొనగలరని బద్వేలు ఎమ్మెల్యే డా.డి.సుధా అన్నారు. మంగళవారం ఏఐటీఎస్‌లో చైర్మన్, చిన్నపిల్లల వైద్యనిపుణులు డా.రామచంద్రారెడ్డి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ముందుస్తుగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓర్పు, సహనానికి నిలువటద్దం మహిళ అని, అందుకే ఈ భూమిని భూదేవత అని స్త్రీలతో పోల్చారన్నారు. నేటి సమాజంలో పురుషులకు దీటుగా అన్ని రంగాలలో దూసుకుపోతున్న మహిళలను చూసి ఆనందపడాలో, ఇంతటి సాంకేతిక కలిగిన రోజులలో కూడా ఇంకా స్త్రీలు హింసించబడుతుంటే బాధపడాలో తెలియడంలేదన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఆధ్యాత్మికపరంగా స్త్రీలు బలోపేతం కావాలన్నారు. రిమ్స్ ప్రిన్సిపాల్ డా.టి.సురేఖ మాట్లాడుతూ మహిళలు స్వయం నిర్ణయాత్మక శక్తిని కలిగి ఉండాలన్నారు. మానసిక ఆరోగ్యం బాగున్నప్పుడే శారీరకంగా ఆనందంగా ఉండగలరన్నారు. రాయచోటి డీఎఫ్ఓ నాగమునీశ్వరి మాట్లాడుతూ మనిషి పుట్టుక, చావు మధ్య ఆధారపడే ఒకే ఒక్క వ్యక్తి మహిళ అని, జీవితంలో ఒక్కసారైనా కుటుంబంలోని మహిళలకు కృతజ్ఞతలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ, స్టూడెంట్స్ ఎఫైర్స్ డీన్ డా.ఎం.సుబ్బారావు, హెచ్ఓడీలు, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ గౌతమి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాజంపేట టౌన్ : మహిళలు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అర్బన్ ఎస్ఐ వి.లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పురుషోత్తం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎస్ఐ విద్యార్థినులనుద్దేశించి మాట్లాడారు. రాజ్యాంగంలో మహిళలకు రక్షణ కల్పించేందుకు అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారికి మరింత ప్రోత్సాహం అందిస్తే అద్భుతాలు సృష్టించగలరని తెలిపారు. ప్రిన్సిపాల్ పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థినులందరు ఉన్నత విద్య అభ్యసించాలని, అప్పుడే సమాజంలో మరింత రాణించేందుకు వీలవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కొన్ని యదార్థ సంఘటనలు ఉదహరిస్తూ విద్యార్థినీలు సమాజంలో ఏ విధంగా ముందుకు సాగాలో తెలిపారు. మహిళా సాధికారిత విభాగం కో–ఆర్డినేటర్ వి.పార్వతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో మహిళలదే కీలకపాత్ర

– డీఎంఅండ్‌హెచ్ఓ కొండయ్య



రాయచోటి అర్బన్ : దేశాభివృద్ధిలో మహిళలదే కీలకపాత్ర అని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్. కొండయ్య అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర–రాష్ట్రప్రభుత్వాలు మహిళా అభ్యున్నతికి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నాయన్నారు. 33 శాతం మహిళా రిజర్వేషన్‌ను విద్యా ఉద్యోగాలలో అమలు చేస్తున్నారంటూ తెలిపారు. ఇళ్ళపట్టాలు, రేషన్‌షాపులు తదితరాలు మహిళల పేర్లతో మంజూరు చేస్తున్నారన్నారు. విద్యార్హత సర్టిఫికెట్లలో తల్లిపేరును చేర్చారంటూ చెప్పారు. మనజిల్లాలోనూ అనేక శాఖలకు ఉన్నతాధికారులుగా మహిళలే పనిచేస్తున్నారన్నారు. దేశ సౌభాగ్యం మహిళలు అయినందున వారిని ప్రతి ఒక్కరూ గౌరవించి, ఆదరించాలన్నారు.

గోదాము తనిఖీ

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని పౌరసరఫరాల శాఖ గోదామును కడప జోనల్ మేనేజర్ బి.బాలకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చౌక దుకాణాలకు సరఫరా చేసే బియ్యం, చక్కెర, కందిపప్పు నిల్వల రికార్డులు తనిఖీ చేసి పరిశీలించారు. ప్రతి చౌక దుకాణానికి బియ్యం తూకాలు వేసి సరిగ్గా ఇవ్వాలని సూచించారు. ఐసీడీఎస్, మధ్యాహ్న భోజన పథకం కింద పోర్టిఫైడ్ బియ్యాన్ని మాత్రమే సరఫరా చేయాలని సూచించారు. ప్రతి నెల రికార్డులు రీకన్సిలేషన్ తప్పకుండా చేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీనివాసులు, గోదాము ఇన్‌చార్జ్ మల్లికార్జున బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి



రైల్వేకోడూరు: మాట్లాడుతున్న సుకుమార్‌రెడ్డి

రైల్వేకోడూరు రూరల్ : ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులుతోపాటు అధిక ఆదాయం ఆర్జించవచ్చని అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి అన్నారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా మంళవారం రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజుపురంలో రైతు కే చంద్రశేఖర్ రాజు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పంటలను ఆయన పరిశీలించారు. టమాటా, వంగ, అరటి తదితర పంటలను పరిశీలించి రైతుల అనుభవాలను తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన కూరగాయలు మండల పరిధిలోని పాఠశాలలకు, హాస్టల్‌లకు అందించాలన్నారు. ఆరోగ్యకరమైన కూరగాయలు వాడిన విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం పలువురు రైతులకు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు వ్యవసాయ నూతన పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిని అనంతరాజుపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వారి అనుభవం కోసం హాజరయ్యారు. కార్యక్రమానికి ఆ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ శివరామకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తనూజ, హెచ్ఓ ఆశియ, ఏఓ సుధాకర్, జెడ్పీటీసీ రత్నమ్మ, ఆర్పీ రమణ, మాస్టర్ ట్రైనర్ సిద్దయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవరుచుకోవాలి

రైల్వేకోడూరు : ప్రస్తుత సమాజంలో విద్యార్థులు పుస్తక పఠనం అలవరచుకోవాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు, పెద్దలు వారికి అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓ రామయ్య ఆధ్వర్యంలో మండలంలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలకు విద్యా సామగ్రితో పాటు కథల పుస్తకాలు బహూకరించారు. పిల్లలకు కథల పుస్తకాలు పంపిణీ చేశారు. ఉర్లగట్టుపోడు సర్పంచ్ గోపి, ఉపాధ్యాయుడు క్రిష్ణమోహన్, సీఆర్పీ అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ తిరునాల



తిరునాలలో పాల్గొన్న భక్తులు

పుల్లంపేట : మండల పరిధిలోని పీవీజీపల్లి గ్రామం వద్ద వెలసిన కనకదుర్గమ్మ తిరునాలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చుట్టుపక్కల గ్రామాలు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకొని పూజలు జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. చాందినీ బండ్లను ఆలయంచుట్టూ తిప్పారు. రాజంపేట సీఐ పుల్లయ్య, పుల్లంపేట ఎస్ఐ సుబ్బారెడ్డి తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. అలాగే డాక్టర్ సానే శేఖర్, మనోజ్ చంద్రలు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

– పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడా

ఒంటిమిట్ట : మండల పరిధిలోని వెంకటాయపల్లె గ్రామం ఓబులేసు కోనలోని మంగళవారం లక్ష్మీనరసింహస్వామి తిరునాలను ఆలయ కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ బండలాగుడు పోటీలను రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. ముందుగా ఆయన ఆలయంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. పోటీలలో కాశినాయన మండలం నరసాపురం గ్రామానికి చెందిన ప్రతాప్ రెడ్డి కాడ్లు మొదటి స్థానంలో నిలవడంతో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి రూ. 50 వేల నగదును బహూకరించారు. ప్రొద్దుటూరు పట్టానానికి చెందిన సందీప్‌రెడ్డి కాడ్లు రెండవ స్థానంలో నిలవడంతో పెద్ద కొత్తపల్లికి చెందిన విద్యుత్ కాంట్రాక్టర్ ఎస్‌వి రమణ రూ. 30 వేల నగదు బహుమతిని అందజేశారు. నందలూరుకు చెందిన ఖాదర్‌వలీ కాడ్లు మూడవ స్థానంలో నిలిచాయి. వారికి ఒంటిమిట్ట మండలం రాచగిడిపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ నల్గొండు వెంకటసుబ్బారెడ్డి రూ. 20వేల నగదు బహుమతిని అందజేశారు. చివరగా కాశినాయన మండలం నరసాపురం గ్రామానికి చెందిన హరీష్‌రెడ్డి కాడ్లు నాలుగవ స్థానంలో నిలవగా, పిడుగు సుబ్బారెడ్డి రూ. 5వేల నగదును అందజేశారు. రాత్రి ఉత్సవమూర్తులకు శాస్త్రోతంగా కల్యాణం జరిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గడ్డం జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, గజ్జల శ్రీనివాసులరెడ్డి, ఎంపీటీసీ ముమ్మడి నారాయణరెడ్డి, దున్నూతల రఘురాంరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మంచి ఫలితాలు సాధించాలి

రామాపురం : పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఎంఈఓ రామకృష్ణుడు తెలిపారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాల్లోని బాలబాలికలకు నాట్య పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించినప్పుడే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు వస్తోందన్నారు.ప్రిన్సిపాల్ శ్యామలాదేవి, గురుకుల పాఠశాల పిన్సిపాల్ చిట్టిబాబు, ఉపాధ్యాయులున్నారు.

ని'క్షయ'కు చేయూతనివ్వండి

సంబేపల్లె/రామాపురం : టీబీ వ్యాధిగ్రస్తులను వైద్య సిబ్బంది దత్తత తీసుకున్నారు. సంబేపల్లె మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యులు సూర్యనారాయణరెడ్డి, భగవద్గీత 13 మంది దత్తత తీసుకున్నారు. అలాగే రామాపురం ఆరోగ్య కేంద్రంలో ఆశ డే కార్యక్రమంలో 8 మంది టీబీ వ్యాధిగ్రస్తులను 8 మంది వైద్య సిబ్బంది దత్తత తీసుకున్నారని వైద్యులు విజయ్‌కుమార్, వినయ్‌కుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా పీహెచ్‌సీలోని వైద్యులు మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. టీబీని అరికట్టేందుకు నిక్షయ అనే పథకాన్ని కేంద్రం తీసుకువచ్చిందన్నారు. దాతలు పౌష్టిక ఆహార కల్పనకు ముందుకు వస్తే వారికి కావాల్సిన మందులను ప్రభుత్వం సమకూరుస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీలలోని వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి మేలు చేసే ఏకైక నాయకుడు జగన్



ఓబులవారిపల్లె: ప్రచారం నిర్వహిస్తున్న సాయికిషోర్ రెడ్డి



రాజంపేట టౌన్: మాట్లాడుతున్న ఆకేపాటి అమర్‌నాథరెడ్డి



సంబేపల్లె: విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం

రాజంపేట టౌన్ : కులం, మతం, పార్టీలన్నది చూడకుండా ప్రతి ఒక్కరికి మేలు చేసే ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. స్థానిక వైష్ణవి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం పట్టణంలోని ప్రైవేట్ స్కూల్స్‌లో పనిచేసే ఉపాధ్యాయులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో జెడ్పీ చైర్మన్ మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక విద్యారంగాన్ని అగ్రగామిగా నిలిపారన్నారు. విద్యారంగ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం కావాలంటే శాసనమండలిలో వైఎస్సార్‌సీపీకి చెందిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ఉండాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పి.రామచంద్రారెడ్డి వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్నారని, అందువల్ల వారికి ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. తొలి ప్రాధాన్యత ఓటును వారికి వేయాలని కోరారు. ఈసందర్భంగా ఓటు వేసే విధానంపై అమర్‌నాథ్‌రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, కాకతీయ విద్యాసంస్థల అధినేత పోలా వెంకటరమణారెడ్డి, ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రతినిధులు వై.నందకిషోర్, ప్రభాకర్‌నాయుడు, జి.రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూసకు మద్దతుగా పోలా ప్రచారం

రాజంపేట టౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి విజయం కోసం మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం పట్టణంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా వైద్యులను, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పలు వార్డుల్లోని పట్టభద్రుల ఓటర్లను కలిసి వెన్నపూస రవీంద్రారెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్లు సనిశెట్టి నవీన్‌కుమార్, డి.సురేష్, న్యామతుల్లా, తంబా సుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు తోట లక్ష్మీనారాయణ, అబ్దుల్ మునాఫ్, ఖాజా, రాజేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి, వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఏపీ టీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి పట్టభద్రులను కోరారు. మంగళవారం మండలంలోని కొర్లకుంట, యల్లాయపల్లి, పెద్దఓరంపాడు, చిన్నంపల్లి, చిన్నఓరంపాడు గ్రామాలలో సాయికిషోర్ రెడ్డి నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ బ్యాలెట్ నమూనాలు చూపించి ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముక్కా రమేష్‌కుమార్ రెడ్డి, పిచ్చన్న, ఎంపీటీసీ దుర్గా ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్.రమేష్ నాయుడు, గంగిరెడ్డి, సర్పంచ్‌లు నారాయణ రెడ్డి, పోలి పాపిరెడ్డి, ఏ.ఈశ్వరయ్య, సుబ్బరాయుడు, సీనియర్ నాయకులు కె.సుబ్బారెడ్డి, కె.శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

సంబేపల్లెలో విస్తృత ప్రచారం

సంబేపల్లె : పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిలను గెలించాలని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చిదంబర్‌రెడ్డిలు మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మంగళవారం మండలంలోని యర్రగుంట్ల బాలికల, కస్తూర్బా పాఠశాల, ఎంపీడీఓ, తహసీల్దార్, వెలుగు తదితర కార్యాలయాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ అభ్యర్థుల నమూనా బ్యాలెట్ పత్రాన్ని చూపి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వడ్డి వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ శ్రీధర్‌రెడ్డి, వసంత శ్రీనివాసులరెడ్డి తదితరులున్నారు.

చిట్వేలిలో..

చిట్వేలి : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాల్సిందిగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, సర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మలిశెట్టి వెంకటరమణ, మండల యూత్ కన్వీనర్ నవీన్, గులాంబాష, సచివాలయ కన్వీనర్ హజ్రత్, సుబ్రమణ్యంలు ప్రచారం నిర్వహించారు.

నందలూరులో..

నందలూరు(రాజంపేట) : నందలూరు మండలంలో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. మండలంలోని ఆల్విన్‌స్కూల్, టంగుటూరు, చింతకాయలపల్లె, కుంపిణీపురం, పొత్తపి తదితర ప్రాంతాల్లోని సచివాలయాల్లో ఉద్యోగులను కలిసి వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు రవీంద్రారెడ్డికి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎంపీపీ వెంట జిల్లా వక్ఫ్ బోర్డు సెక్రటరీ సయ్యద్‌అమీర్, ముదిరాజ్ కార్పొరేషన్ స్టేట్ డైరక్టరు లక్ష్మీనరసయ్య, మండల కో–ఆప్షన్ సభ్యుడు కలీం, వైఎస్సార్‌సీపీ స్టేట్ యూత్‌సెక్రటరీ నడివీధి సుధాకర్, షావలీ, మురహరి, ఆంజినేయులు, పొత్తపి ఎంపీటీసీ చంద్రశేఖర్, బి.లక్ష్మయ్య, ఎంపీటీసీ పెంచలయ్య తదితరులు ఉన్నారు. అనంతరం ఎంపీపీ నందలూరులోని స్టేట్‌బ్యాంక్, కెనరా బ్యాంకుల్లోని అధికారులను, సిబ్బందిని కలిసి ఓటు వేయాలని కోరారు.

వెన్నపూస విజయం కోసం విస్తృత ప్రచారం

రాజంపేట టౌన్ : పట్టణంలోని పన్నెండవ వార్డులో మంగళవారం డీసీఎంఎస్ మాజీ చైర్మన్, ఆ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌ఛార్జ్ రెడ్డిమాసి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలంలోని కూచివారిపల్లె పంచాయతీ పరిధిలోని తుమ్మల అగ్రహారంలో ముమ్మరంగా ప్రచారం చేశారు. నమూనా బ్యాలెట్ పత్రాన్ని అందించి ఓటు ఎలా వేయాలో వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ ఎస్.జాకీర్‌హుస్సేన్, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు ఉదయ్‌రెడ్డి, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.